క్లుప్తంగా

రామచంద్రపురంలో నేడు గడపగడపకూ మన ప్రభుత్వం

కిర్లంపూడి: మండలంలోని రామచంద్రపురంలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తోట రవి సోమవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలి



శిక్షణకు హాజరైన బీఎల్‌ఓలు

రౌతులపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ బి.భీమారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బూత్ యాప్ వినియోగం, ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఇతర ప్రాంతాలకు వలసవెళ్లిన, చనిపోయిన ఓటర్ల వివరాలను సమగ్రంగా బూత్‌యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ పీవీవీ సత్యనారాయణ, వీఆర్‌ఓలు, సచివాలయ మహిళా సంరక్షకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

రౌతులపూడి: మండలంలోని స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందికి ఏపీఎం సూర్యకుమారి సూచించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో సోమవారం వీఓ ఏలతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్వాక్రా సంఘాలకు లీడ్ బ్యాంకుల ద్వారా అందించిన రుణాల వివరాలు, చెల్లింపులు, స్త్రీ నిధి, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ రుణాల వసూళ్లపై గ్రామాల వారీగా సమీక్షించారు. సంఘాలు అభివృద్ధికి ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు సరస్వతి, ప్రకాశమ్మ, అప్పారావు, శ్రీనివాస్, సీత తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ



విద్యాశాఖ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన రెండో విడత నాడు–నేడు పనులు పారదర్శకంగా ఉండాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన నాడు–నేడు పనుల రికార్డులను తనిఖీ చేశారు. ఎంఈఓ అబ్బాయిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రభుత్వ పాఠశాలలను రూ.కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ రక్షిత తాగునీరు

శంఖవరం: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో జలజీవన్ మిషన్ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి రక్షిత తాగునీరు అందిస్తామన్నారు. పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

వంతెన నిర్మాణ స్థలం పరిశీలన

గోకవరం: స్థానిక ఠాణా సెంటర్‌లో ఊరకాలువపై నూతనంగా వంతెన నిర్మాణానికి సేకరించిన స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సోమవారం పరిశీలించారు. టీడీపీ నాయకులతో కలిసి వంతెన నిర్మించే స్థలాన్ని పరిశీలించిన ఆయన వంతెనకు సంబంధించిన పలు విషయాలను ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష కాలంలో నిర్మించిన వంతెన ఇరుకుగా ఉండటం, వంతెనకు ఇరువైపులా భారీ మలుపులు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. నూతనంగా నిర్మించే వంతెనకు ఇరువైపులా మలుపులు లేకుండా చూడాలని అధికారులకు సూచించామన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

అర్హులకు రక్ష.. జగనన్న సురక్ష

- గత పాలకులు నీరు–చెట్టు నిధులు దోచేశారు
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- గ్రామాల్లో జోరుగా 'జగనన్న సురక్ష'



హంసవరంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు–చెట్టు నిధులన్నీ టీడీపీ కార్యకర్తలే దోచుకున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని హంసవరంలో సోమవారం ఎంపీపీ బొప్పన రాము అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అర్హులకు కాకుండా అనర్హులకు, టీడీపీ కార్యకర్తలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించారన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీలో యనమల రామకృష్ణుడు తుని నియోజకవర్గానికి ఏమీ చేయలేదన్నారు. పంచాయతీ ఆఫీసు కట్టాలన్నా నానా తిప్పలు పడ్డారన్నారు. ఇప్పుడు సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లకు సొంత భవనాలు నిర్మిస్తున్నామన్నారు. హంసవరానికి గడిచిన నాలుగేళ్లలో రూ.34 కోట్ల ప్రయోజనం కలిగిందన్నారు. ప్రతి కుటుంబానికి రూ.మూడు లక్షల నుంచి రూ.ఆరు లక్షలు లబ్ధి చేకూరిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో 919 దరఖాస్తులు అందగా ఇప్పటికే 912 పరిష్కరించినట్టు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల ధృవపత్రాలను అందజేశారు. సర్పంచ్ రాయి మేరీఅవినాష్, పెరిక కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరావు, జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, తహసీల్దార్ ఎల్.శివకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

హంసవరం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామ సర్పంచ్ రాయి మేరీఅవినాష్ ఆధ్వర్యంలో చేరిన వారికి రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సిద్ధాంతపు సురేష్, మదినే కాశి, మచ్చా సుబ్బారావు, పోతు రాము, రాయి సత్యనారాయణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ మేలు

ఏలేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పర్వతపూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని తూర్పులక్ష్మీపురంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజలు జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్, సర్పంచ్ వి.భార్గవి, అడపా పార్థసారథి, చిక్కాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలు తీర్చేందుకే...

తుని: ప్రజల అవసరాలను తెలుసుకుని వారికి కావాల్సిన అన్నిరకాల ధ్రువపత్రాలను వెంటనే అందించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పట్టణంలోని 22, 25, 11 వార్డుల్లో సోమవారం కమిషనర్ ప్రసాదరాజు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా తదితరులు పాల్గొన్నారు.

పేద, మధ్య తరగతి వర్గాల కోసమే జగనన్న సురక్ష

తొండంగి: పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మండలంలోని కోదాడలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్దిదారులకు ఆయన ధ్రువపత్రాలు అందజేశారు. తహసీల్దార్ బి.సుబ్రహ్మణ్యం, తుని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు గాబు రాజు, దడాల విజయబాబు, తుని మార్కెట్ కమిటీ డైరెక్టర్ బూర్తి కృష్ణ పాల్గొన్నారు.



తూర్పులక్ష్మీపురంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

పేదల సంక్షేమానికి మరింత భరోసా

ప్రత్తిపాడు: పేదల సంక్షేమానికి మరింత భరోసా కల్పించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టారని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ కమ్యూనిటీ హాలు ఆవరణలో సోమవారం గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ఎంపీపీ కాంతి సుధాకర్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, డైరెక్టర్ గోళ్ల జయశేఖర్, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, జిల్లా ట్రేడ్ యూనియన్ నాయకుడు పత్రి రమణ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

జగ్గంపేట: పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని కాట్రావులపల్లిలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని 285 మంది లబ్దిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, కాట్రావులపల్లి సర్పంచ్ పిట్టా సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం

గండేపల్లి: గ్రామాల్లో ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని సూరంపాలెంలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వలంటీర్లు చేస్తున్న సేవలకు సంతృప్తిచెంది వారిని పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు గత ప్రభుత్వంలో ప్రజలకు ఏ సర్టిఫికెట్ కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టు కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని, ఏమి కావాలన్నా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందన్నారు. గ్రామస్తులు విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీలు, నివాస స్థలాలు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులక ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైస్ ఎంపీపీ కుంచె రాజా, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, గ్రామ సర్పంచ్ మారిశెట్టి గంగాభవాని, ఉప సర్పంచ్ స్వామిని బాబు, గ్రామ సచివాలయ కన్వీనర్ పోశ్ని బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



కాట్రావులపల్లిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: మండలంలోని రాజుపాలెంలో సోమవారం సర్పంచ్ గొడే పద్మవతి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని 250 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, వైఎస్సార్ మండలాధ్యక్షుడు దోమాల గంగాధర్, జనపరెడ్డి బాబు, జోకా శ్రీను, గణేశుల లచ్చబాబు, భూపాలపట్నం ప్రసాద్, తోట విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- తూర్పులక్ష్మీపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



తూర్పు లక్ష్మీపురంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని తూర్పులక్ష్మీపురంలో సోమవారం ఆయన గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇప్పటికే 98 శాతం అమలు చేశారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్, చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారథి, పసల నాగేశ్వరరావు, రాంబాబు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

సొంత కొడుకులా ఆదరించి..



ప్రసాదరావు దంపతుల సమస్యలు తెలుసుకుంటున్న వలంటీర్ దుర్గాప్రసాద్

కరోనా సమయంలో మా వలంటీర్ పత్తిగుళ్ల దుర్గప్రసాద్ మాకు అండగా నిలిచాడు. నాకు, నా భార్యకు అప్పట్లో కరోనా రావడంతో ఎవ్వరూ మా వంక చూడలేదు. కష్ట సమయంలో వలంటీర్ దుర్గాప్రసాద్ కన్న కొడుకులా ఆదుకున్నాడు. సమయానికి మందులు ఇవ్వడం, కషాయం తాగించడం, దగ్గరే ఉండి ధైర్యం చెప్పడం చేసేవాడు. ఇప్పుడు తలచుకుంటే అతను ఆ రోజు మాకు అండగా లేకపోతే బతికి ఉండేవాళ్లమా అనిపిస్తుంది. చేతిరేఖలు అరిగిపోవడం వల్ల వేలిముద్రలు పడకపోతే అతనే వేలిముద్ర వేసి ప్రతినెలా పింఛను ఇస్తున్నాడు. కరెంట్ బిల్లులో తేడాలు జరిగి పింఛను ఆగిపోతే అతనే సరిచేయించి ఇబ్బంది లేకుండా చేశాడు. ప్రసాద్ కొడుకులా చేసిన సేవలు జీవితాంతం గుర్తుంటాయి.

–పెండెం ప్రసాదరావు, లబ్ధిదారు, జగ్గంపేట

అర్హతే ప్రామాణికంగా పథకాలు



వలంటీర్ వ్యవస్థ వచ్చాక అర్హతే ప్రామాణికంగా పథకాలు అందుతున్నాయి. మా వలంటీర్ మాడెం రాజ్యలక్ష్మి తరచూ మా ఇంటికి వచ్చి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మాకు అవగాహన కల్పిస్తోంది. అర్హత కలిగిన ప్రతి పథకం మాకు అందేలా కృషి చేస్తోంది. ఆమె కృషి ఫలితంగా నాకు జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం, అమ్మ ఒడి, రైతు భరోసా పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. గతంలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందడం అంటే గగనంగా ఉండేది. ఇప్పుడు గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా అన్ని పథకాలు మా ఇంటికే వస్తున్నాయి. వలంటీర్ సేవలు అభినందనీయం.

–అన్నిక మంగ, కిత్తుమూరిపేట, ప్రత్తిపాడు రూరల్

శాకంబరీగా దర్శనమిచ్చిన అపీత కుచాంబాదేవి



ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో వేంచేసిన అపీత కుచాంబాదేవి అమ్మవారు సోమవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసంలో చివరిరోజు, అమావాస్యను పురస్కరించుకొని పండితులు పలురకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారికి శాకంబరి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. దేవస్థానం పీఠాధిపతి రమణస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తలుపులమ్మ సన్నిధిలో సినీ హీరో గోపీచంద్ పూజలు



హీరో గోపీచంద్‌కు తలుపులమ్మ తల్లి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ అధికారులు

తుని రూరల్: ప్రముఖ సినీ హీరో గోపీచంద్ లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం సాయంత్రం ఆలయానికి వచ్చిన ఆయనకు పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న గోపీచంద్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అధికారులు బహూకరించారు.

23న సింహగర్జన సభ

ప్రత్తిపాడు: గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 23న నిర్వహించే సింహగర్జన సభకు ప్రజలు తరలిరావాలని యాదవ హక్కుల పోరాట సమితి ఉభయ గోదావరి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ గొంప శివకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడులో సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బోడే రామచంద్ర యాదవ్ నూతన పార్టీని పెట్టారన్నారు. ఈ పార్టీ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ప్రజా సింహగర్జన సభకు ప్రజలు భారీగా తరలిరావాలని ఆయన కోరారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

ఏలేశ్వరం: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం ఏఓ జ్యోతి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి కంచుకోట జగ్గంపేట

మాజీ ఎంపీ తోట నరసింహం



సమావేశంలో ప్రసంగిస్తున్న తోట నరసింహం

గండేపల్లి: జగ్గంపేట నియోజకవర్గం వైఎస్సార్ సీపీకి కంచుకోటగా నిలుస్తుందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట నరసింహం అన్నారు. మండలంలోని సుబ్బాయమ్మపేటలో ఆయన అభిమానులు సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో తోట నరసింహం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన పార్టీల నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో తోట రాంజీ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ గఫూర్, అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ మాజీ డైరెక్టర్ కరుటూరి శ్రీన్‌వాస్, జగ్గంపేట ఏఎంసీ మాజీ చైర్మన్ ఒబిణ్ణి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఆలయ నిర్మాణ పనులు



సీతారాంపురంలో నిర్మిస్తున్న దుర్గామాత ఆలయం

తొండంగి: మండలంలోని సీతారాంపురంలో దుర్గామాత ఆలయ నిర్మాణపనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామపెద్దలు, దాతల సహకారంతో గ్రామ శివారులోని మెయిన్‌రోడ్డు వద్ద అమ్మవారి ఆలయం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శ్లాబ్ నిర్మాణం పూర్తి కాగా గోపురం పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తయిన తరువాత దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

గండేపల్లి: అమావాస్య సందర్భంగా సోమవారం తాళ్లూరు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పండితులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రైల్వే ప్రయాణికులకు పటిష్ట భద్రత



రైల్వే ప్రయాణికుల భద్రతపై చర్చిస్తున్న పోలీసులు

తుని: రైల్వే ప్రయాణికులకు భద్రత కల్పించేందుకు మూడు విభాగాలకు చెందిన పోలీసులు సమష్టిగా పని చేయాలని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటస్వామి కోరారు. తుని జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఆర్పీఎఫ్, జీఆర్పీ, లా అండ్ ఆర్డర్ విభాగాలకు చెందిన అధికారులతో ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్, సీఐ నాగ దుర్గారావు సమావేశం నిర్వహించారు. రైళ్లలో అక్రమ గంజాయి రవాణా, దొంగతనాలు, వీధి బాలల భిక్షాటన అరికట్టేందుకు ప్రయాణికులకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు తరచూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వారిపై నిఘా ఉంచాలని తుని పట్టణ సీఐ నాగ దుర్గారావు సూచించారు. మూడు విభాగాలు సమన్వయంతో పని చేస్తే నేరాల నియంత్రణకు అడ్డుకట్ట వేయవచ్చునన్నారు.

డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన

జగ్గంపేట: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై విద్యాసాగర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం మత్తు పదార్థాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనార్థాలను ఎస్సై వివరించారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, రవాణా చేస్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

జగ్గంపేట: పదహారో నంబర్ జాతీయ రహదారిపై జగ్గంపేట వద్ద సోమవారం స్థానిక ఎస్సై విద్యాసాగర్ వాహనాల తనిఖీ నిర్వహించారు. పరిమితికి మించి వేగంగా వెళుతున్న 50 వాహనాలను గుర్తించి, వాహనదారులకు రూ.22 వేల అపరాధ రుసుం విధించినట్లు ఎస్సై తెలిపారు. వాహనా దారులు వేగం కన్నా ప్రాణం మిన్న అనే నానుడిని గుర్తుంచుకోవాలన్నారు. ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబ సభ్యులు దిక్కులేని వారిగా మారతారని తెలిపారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించి డ్రైవింగ్ చేయాలని సూచించారు.